సెమీస్‌కు అడుగు దూరంలో

అండర్-19 ప్రపంచకప్‌లో భారత్‌కు నాలుగో విజయం

బంగ్లాదేశ్‌పై సునాయాస గెలుపు • త్రిష ఆల్‌రౌండ్ షో

వైష్ణవి (3/15)

కౌలాలంపూర్: ప్రత్యర్థి ఎవరైనా మహిళల అండర్-19 ప్రపంచకప్‌లో తమకు తిరుగేలేదని యువ భారత్ మరోసారి నిరూపించింది. అపోజిషన్ టీమ్‌ను రెండంకెల స్కోరుకే పరిమితం చేస్తున్న మన బౌలర్లు.. బంగ్లా బ్యాటర్లపైనా అదే దూకుడును కొనసాగించి టీమ్‌ఇండియాకు ఈ టోర్నీలో వరుసగా నాలుగో విజయాన్ని అందించారు. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్.. సూపర్ సిక్స్‌లో భాగంగా ఆడిన తొలి మ్యాచ్‌లో బంగ్లాపై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. లెఫ్టార్మ్ స్పిన్నర్ వైష్ణవి శర్మ (3/15) స్పిన్ మాయాజాలంతో మిడిలార్డర్ పనిపట్టగా సీమర్లు జోషిత (1/6), షబ్నమ్ షకీల్ (1/7) రాణించడంతో మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా.. 20 ఓవర్లకు 8 వికెట్ల నష్టానికి 64 పరుగులు చేసింది. కెప్టెన్ సమైయ అక్తర్ (21), జన్నతుల్ (14) మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. ఛేదనను భారత్ 7.1 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి పూర్తిచేసింది. తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష బ్యాటింగ్ (31 బంతుల్లో 40, 8 ఫోర్లు)తో పాటు బంతి (1/6)తోనూ మెరిసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. వైష్ణవికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. కాగా ఈ టోర్నీలో భారత్‌తో తలపడిన ఒక్క జట్టు కూడా మూడంకెల స్కోరు కూడా చేయలేకపోవడం విశేషం. వెస్టిండీస్ (44), మలేషియా (31), శ్రీలంక (58)తో పాటు తాజాగా బంగ్లాదేశ్ (64) కూడా 70 పరుగుల లోపే తోకముడిచాయి.

త్రిష (40)

'నా కెరీర్‌కు అదే టర్నింగ్ పాయింట్'

చెన్నై: పొట్టి ఫార్మాట్‌లో గత ఏడాదికాలంగా అంచనాలకు మించి రాణిస్తున్న హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ.. టీ20లలో భారత సారథి సూర్యకుమార్ యాదవ్ తనను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు పంపడమే కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అని అన్నాడు. చెన్నైలో ఇంగ్లండ్‌తో మ్యాచ్ ముగిశాక తిలక్ మాట్లాడుతూ.. 'దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్నప్పుడు సూర్యా భాయ్ నాకోసం తన 3వ స్థానాన్ని వదులుకున్నాడు. అదే నా కెరీర్‌లో కీలక మలుపు. అందుకు సూర్యకు కృతజ్ఞతలు చెబుతున్నా. జట్టు కోసం ఏ స్థానంలో అయినా బ్యాటింగ్ చేయడానికి నేను ఎల్లప్పుడూ సిద్ధమే' అని తెలిపాడు. సౌతాఫ్రికా సిరీస్‌లో వరుస సెంచరీలతో దుమ్ము రేపిన ఈ హైదరాబాదీ.. చెన్నై మ్యాచ్‌లో ఒత్తిడిలోనూ రాణించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు.

విన్నర్ సిన్నర్

ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ నిలబెట్టుకున్న ఇటలీ కుర్రాడు • ఫైనల్‌లో జ్వెరెవ్ పరాభవం

మెల్‌బోర్న్: ప్రతిష్టాత్మక ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ (పురుషుల)ను ఇటలీ కుర్రాడు యానిక్ సిన్నర్ నిలబెట్టుకున్నాడు. డిఫెండింగ్ చాంపియన్‌గా ఈ టోర్నీ బరిలో నిలిచిన అతడు.. ఫైనల్‌లో జర్మనీ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను మట్టికరిపించి వరుసగా రెండో టైటిల్‌ను, కెరీర్‌లో మూడో గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. రాడ్ లీవర్ ఎరీనా వేదికగా ఆదివారం ముగిసిన పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో 23 ఏండ్ల సిన్నర్.. 6-3, 7-6 (7/4), 6-3తో జ్వెరెవ్‌పై గెలిచాడు. 2 గంటల 42 నిమిషాల పాటు హోరాహోరిగా జరిగిన పోరులో సిన్నర్ దూకుడుకు ఆరంభంలో అడ్డుకట్ట వేసిన జ్వెరెవ్.. రెండో సెట్ టైబ్రేక్ తర్వాత చేతులెత్తేశాడు. తొలి సెట్ ఒకదశలో 3-3తో స్కోరు సమంగా ఉన్నప్పటికీ ఆ తర్వాత సిన్నర్ పుంజుకున్నాడు. బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేశాడు. కానీ రెండో సెట్‌లో జ్వెరెవ్ జూలు విదిల్చాడు. అతడు గట్టిగానే పోరాడటంతో సెట్ టైబ్రేక్‌కు దారితీసింది. టైబ్రేక్ ఆరంభంలో పాయింట్లు సాధించిన జ్వెరెవ్.. ఆ తర్వాత సిన్నర్ జోరు ముందు నిలవలేకపోయాడు. ఇక మూడో సెట్‌లో మాత్రం టాప్ సీడ్ మరింత జోరు పెంచడంతో జ్వెరెవ్‌కు నిరాశ తప్పలేదు. ఇప్పటిదాకా మూడు గ్రాండ్ స్లామ్ ఫైనల్స్‌కు వెళ్లిన జ్వెరెవ్.. మరోసారి తుది మెట్టు ముందు బోల్తా కొట్టడంతో మ్యాచ్ ముగిసిన తర్వాత అతడు కన్నీటి పర్యంతమయ్యాడు. మ్యాచ్‌లో సిన్నర్ 6 ఏస్‌లు, 32 విన్నర్లు కొట్టగా జ్వెరెవ్ 12 ఏస్‌లు సంధించినా 45 అనవసర తప్పిదాలతో పరాజయం వైపున నిలిచాడు. ఇక ఈ విజయంతో సిన్నర్.. 1992-93 (జిమ్ కొరియర్) తర్వాత ఆస్ట్రేలియా ఓపెన్‌ను వరుసగా రెండేండ్లు గెలిచిన ఆటగాడిగా పిన్న వయస్కుడిగా రికార్డులకెక్కాడు. 2024లో ఆస్ట్రేలియా ఓపెన్, యూఎస్ ఓపెన్ గెలిచిన ఈ ఇటలీ యువ సంచలనం.. ఆ దేశం తరపున మూడు గ్రాండ్‌స్లామ్‌లు గెలిచిన తొలి ఆటగాడిగా కూడా చరిత్ర సృష్టించాడు.

ప్రైజ్ మనీ

సిన్నర్	రూ. 19.5 కోట్లు
జ్వెరెవ్	రూ. 10 కోట్లు

జ్యోతికి స్వర్ణం

ఢిల్లీ: కొత్త సీజన్‌ను తెలుగమ్మాయి జ్యోతి యర్రాజీ రికార్డు రేసుతో ప్రారంభించింది. ఫ్రాన్స్‌లో జరుగుతున్న నాంటెస్ మెట్రోపోల్ వరల్డ్ అథ్లెటిక్స్‌లో భాగంగా 60 మీటర్ల రేసును ఆమె 8.04 సెకన్లలోనే పూర్తిచేసి కొత్త జాతీయ రికార్డును సృష్టించడమే గాక స్వర్ణాన్నీ గెలుచుకుంది. ఈ క్రమంలో జ్యోతి గత రికార్డు (2024లో ఆసియా ఇండోర్ చాంపియన్‌షిప్ మీట్‌లో 8.12 సెకన్లు)ను అధిగమించింది.

హైదరాబాద్‌కు ఇన్నింగ్స్ విజయం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బీ రెండో అంచె పోటీలను హైదరాబాద్ విజయంతో ఆరంభించింది. ఉప్పల్ వేదికగా ఆదివారం ముగిసిన మ్యాచ్‌లో హైదరాబాద్.. ఇన్నింగ్స్ 43 రన్స్‌తో హిమాచల్ ప్రదేశ్‌ను చిత్తు చేసింది. మొదటి ఇన్నింగ్స్‌లో 275 పరుగులు చేసి ఆలౌట్ అవడంతో ఫాల్ ఆన్ ఆడిన హిమాచల్.. రెండో ఇన్నింగ్స్‌లో 247 పరుగులకు కుప్పకూలింది. తనయ్ త్యాగరాజన్ (6/118) ఆరు వికెట్లతో చెలరేగగా మొదటి ఇన్నింగ్స్‌లో ఫైఫర్‌తో రాణించిన అనికేత్ రెడ్డి (4/46) మరో అద్భుత ప్రదర్శనతో హిమాచల్‌కు ఓటమి తప్పలేదు. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 565 పరుగుల భారీ స్కోరు చేసిన విషయం విదితమే.

రసవత్తరంగా ముల్తాన్ టెస్టు

• గెలుపు కోసం పాక్, విండీస్ హోరాహోరి

ముల్తాన్: పాకిస్థాన్, వెస్టిండీస్ మధ్య ముల్తాన్‌లో జరుగుతున్న రెండో టెస్టు రసవత్తరంగా సాగుతోంది. స్పిన్నర్లు వికెట్ల పండుగ చేసుకుంటున్న ఈ టెస్టులో విండీస్ నిర్దేశించిన 254 పరుగుల ఛేదనలో భాగంగా రెండో రోజు ఆట ముగిసే సమయానికి పాక్.. 4 వికెట్ల నష్టానికి 76 పరుగులు చేసింది. ఆ జట్టు విజయానికి మరో 178 పరుగులు అవసరం కాగా విండీస్ గెలిచి సిరిస్ సమం చేయాలంటే మరో 6 వికెట్లు పడగొట్టాల్సి ఉంది. ఛేదనలో పాక్ సారథి షాన్ మసూద్ (2)తో పాటు మరో ఓపెనర్ హరేరియా (2), కమ్రాన్ గులామ్ (19) విఫలమవగా బాబర్ ఆజమ్ (31) ఫర్వాలేదనిపించాడు.

నేటి నుంచే టీడీసీఏ క్రికెట్ టోర్నీ

బరిలో తెలంగాణ ఉమ్మడి జిల్లాల జట్లు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) ఆధ్వర్యంలో సోమవారం (జనవరి 27) నుంచి అండర్-17 క్రికెట్ టోర్నమెంట్ ఆరంభం కానుంది. నాలుగు రోజుల పాటు నగరంలోని ఎల్బీ స్టేడియం వేదికగా జరుగనున్న ఈ టోర్నీలో ఉమ్మడి జిల్లాల (9) జట్లతో పాటు టీడీసీఏ ఎలెవన్ పోటీపడుతుంది. ప్రతిభావంతులైన గ్రామీణ క్రికెటర్లను వెలుగులోకి తెచ్చేందుకే ఈ టోర్నీని నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా టీడీసీఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో సత్తా చాటిన క్రికెటర్లను మార్చిలో అమెరికా క్రికెట్ అకాడమీ జట్టుతో పోటీపడే టోర్నీకి ఎంపిక చేయనున్నట్టు ఆయన చెప్పారు.

ప్రతిభామూర్తులకు పట్టం

తెలుగు సినీరంగంలో యాభైఏళ్లుగా సుదీర్ఘ నట ప్రస్థానాన్ని సాగిస్తూ చిరస్మరణీయమైన విజయాలను సాధించిన అగ్ర నటుడు బాలకృష్ణకు ప్రతిష్టాత్మక పద్మభూషణ్ పురస్కారం దక్కడంతో తెలుగు సినిమా యావత్తు ఆనందం వ్యక్తం చేసింది. శనివారం కేంద్రప్రభుత్వం పద్మ పురస్కారాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈసారి కళల విభాగంలో సినీరంగం నుంచి బాలకృష్ణ, తమిళ అగ్ర హీరో అజిత్, కన్నడ నటుడు అనంత్‌నాగ్, సీనియర్ కథానాయిక శోభన, దర్శకనిర్మాత, నటుడు శేఖర్ కపూర్‌లకు పద్మభూషణ్ అవార్డులు వరించాయి.

యాభైఏళ్ల సుదీర్ఘ నటప్రస్థానంలో ఎన్నో అద్భుతమైన పాత్రలు పోషించారు బాలకృష్ణ. 'తాతమ్మ కల' (1974) చిత్రం ద్వారా బాలనటుడిగా సినీ రంగ ప్రవేశం చేశారు. 'సాహసమే జీవితం'(1984) చిత్రంతో హీరోగా పరిచయమయ్యారు. పి.వాసు దర్శకుడు. ఆ సినిమా పెద్దగా ఆడలేదు. అదే ఏడాది వెంటవెంటనే 'డిస్కోకింగ్' 'జననీ జన్మభూమి' రూపంలో మరో రెండు ఫ్లాపులు. హీరోగా హ్యాట్రిక్ ఫ్లాపులతో బాలకృష్ణ కెరీర్ మొదలైంది. అదే ఏడాది విడుదలైన 'మంగమ్మగారి మనవడు' బాలయ్యకు మరువలేని విజయాన్ని అందించింది. ఇక అక్కడ్నుంచి ఆయన వెనక్కి తిరిగి చూసుకోలేదు. ముఖ్యంగా '1986' బాలకృష్ణ కెరీర్లో మెమరబుల్ ఇయర్. ఆ ఏడాది ఆయన నటించిన ఆరు సూపర్ హిట్లు విడుదలయ్యాయి. ఒకే ఏడాది ఆరు విజయాలు. నేటి హీరోల్లో ఎవరికీ లేని రికార్డ్ ఇది. స్టార్ హీరోగా దూసుకుపోతూ.. వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారు బాలకృష్ణ. ముఖ్యంగా 80ల్లో ఆయన నటించిన మంగమ్మగారి మనవడు, ముద్దులకృష్ణయ్య, సీతారామ కల్యాణం, అనసూయమ్మగారి అల్లుడు, ముప్పు గోపాలుడు, భలేదొంగ, ముద్దులమావయ్య చిత్రాలు అప్పటి యువతనేకాక, కుటుంబ ప్రేక్షకుల్ని కూడా విశేషంగా అలరించాయి. అప్పటికే ఊరమాస్ ఇమేజ్‌ను సొంతం చేసుకున్న బాలకృష్ణ తన ఇమేజ్‌కు పూర్తి భిన్నంగా.. ఒక్క ఫైటు లేకుండా 'నారినారి నడుమ మురారి' అనే పూర్తిస్థాయి రొమాంటిక్ క్లాసిక్ హీరోగా నటించి, తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించారు. బి. గోపాల్ దర్శకత్వంలో వచ్చిన 'లారీ డ్రైవర్' బాలకృష్ణ కెరీర్లో మేలి మలుపు. ఆ సినిమాలో ఓ కొత్త బాలయ్యను ప్రేక్షకులు చూశారు. ఇక బాలకృష్ణ కీర్తికిరీటంలో కలికితురాయి లాంటి సినిమా అంటే.. వెంటనే గుర్తొచ్చే సినిమా 'ఆదిత్య 369'. సైన్స్ ఫిక్షన్ కథాంశంతో సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన ఈ చిత్రం బాలయ్యకు ఓ గౌరవాన్ని తెచ్చిపెట్టింది. సింగీతం దర్శకత్వంలోనే ఆయన నటించిన మరో సినిమా 'భైరవద్వీపం'. బాలయ్యలోని విలక్షణ నటనకు నిదర్శనంగా నిలిచిందా సినిమా. ఇక 90ల్లో వచ్చిన రౌడీ ఇన్స్పెక్టర్ బొబ్బిలిసింహం, వంశానికొక్కడు, పెద్దన్నయ్య చిత్రాలు మాస్ హీరోగా బాలకృష్ణను మరోస్థాయిలో నిలబెట్టాయి. 'సమరసింహారెడ్డి (1999)తో ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులనే తిరగరాశాడు. 'నరసింహనాయుడు'(2001) బాలయ్య కెరీర్లో మరో మైల్‌స్టోన్. సినిమా వందరోజులు ఆడటమే గొప్ప అనుకునే రోజుల్లో.. 105 కేంద్రాల్లో వందరోజులు ఆడి, ఇండస్ట్రీ నివ్వెరపోయే విజయాన్ని సాధించారు బాలకృష్ణ.

'శ్రీతిరుపతి వెంకటేశ్వర కల్యాణం' సినిమాలో నారదునిగా, దానవీరశూర కర్ణ, శ్రీమద్విరాటపర్వం చిత్రాల్లో అభిమన్యునిగా, బ్రహ్మర్షి విశ్వామిత్ర'లో హరిశ్చంద్రుడు, దుష్యంతుడిగా (ద్విపాత్రాభినయం), శ్రీకృష్ణార్జునవిజయంలో కృష్ణుడు, అర్జునుడిగా (ద్విపాత్రాభినయం), బాపు శ్రీరామరాజ్యంలో శ్రీరాముడిగా అద్భుతమైన నటన కనపరిచారు బాలకృష్ణ. ఇవన్నీ ఆయన నటించిన పౌరాణిక చిత్రాలు కాగా, వేములవాడ భీమకవిలో భీమకవిగా, అక్బర్ సలీం అనార్కలిలో సలీంగా, శ్రీపోతులూరి వీరబ్రహ్మంగారి చరిత్రలో సిద్దప్పగా, గౌతమీపుత్ర శాతకర్ణిలో శాతకర్ణిగా అనితర సాధ్యమైన నటన కనపరిచారు బాలయ్య. ఇవన్నీ ఆయన నటించిన చారిత్రాత్మకాలు. ఇక బాలయ్య నటించిన ఏకైక జానపదచిత్రం 'భైరవద్వీపం'. ఇది అఖండ విజయాన్ని సాధించింది. బాలకృష్ణ నటించిన సైన్స్‌ఫిక్షన్ 'ఆదిత్య 369'. ఇది ఆయన కెరీర్‌లోనే క్లాసిక్‌గా నిలిచింది. ఇక భక్తిరసాత్మక చిత్రమైన 'పాండురంగడు'లో భక్తునిగా, భగవంతునిగా నటించి రికార్డు సృష్టించారు బాలకృష్ణ.

అజిత్ కుమార్.. మాస్‌మంత్రం

తమిళ హీరో అజిత్‌ది విలక్షణ వ్యక్తిత్వం. సినిమాలతో పాటు రేసింగ్‌ను కూడా అంతే ఇష్టపడుతుంటారు. స్టార్‌డమ్, కలెక్షన్స్ గురించి అస్సలు పట్టించుకోరు. . ఇప్పటికి అరవైకి పైగా చిత్రాల్లో నటించగా..వాటిలో అత్యధిక చిత్రాలు బ్లాక్‌బస్టర్ హిట్సే కావడం హీరోగా అజిత్ స్థాయి ఏమిటో తెలియజేస్తాయి. 90వ దశకంలో రొమాంటిక్ హీరోగా మొదలై నేటి యాక్షన్ హీరోగా ఆయన ప్రస్థానంలో ఎన్నో ఆసక్తికరమైన మలుపులున్నాయి. అజిత్ సికింద్రాబాద్‌లో జన్మించారు. అయితే ఆయన తండ్రి సుబ్రమణిది కేరళ మూలాలున్న కుటుంబం. సుబ్రమణి ఉద్యోగరీత్యా కొంతకాలం సికింద్రాబాద్‌లో ఉన్నారు. ఆ సమయంలోనే అజిత్ జన్మించారు. ఆయనకు ఏడాదిన్నర వయసులో వారి కుటుంబం చెన్నైకి వెళ్లి స్థిరపడింది. 'ఎన్ వీడు ఎన్ కనవర్' (1990) చిత్రం ద్వారా చైల్డ్ ఆర్టిస్టుగా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చారు అజిత్. తమిళ చిత్రం 'అమరావతి' (1993) ద్వారా హీరోగా అరంగేట్రం చేశారు. 'ప్రేమపుస్తకం' చిత్రంతో తెలుగులో హీరోగా పరిచయమయ్యారు. 'ఆశై' 'కాదల్ కోట్టై' (తెలుగులో 'ప్రేమలేఖ'), వాలి సినిమాలు అజిత్ కెరీర్ ఆరంభంలో సూపర్‌హిట్స్‌గా నిలిచాయి. అమర్‌కలమ్, దీనా, సిటిజన్, వరలారు, బిల్లా, మన్‌కతా, ఉల్లాసం, కందు కొండైన్ కందు కొండైన్, ఆరంభం, వేదాళం, వివేగం, విశ్వాసం..ఇలా వరుస విజయాలతో అగ్ర హీరోగా ప్రస్థానం సాగిస్తున్నారు. అజిత్‌కు తమిళనాట అసంఖ్యాకమైన అభిమాన గణం ఉంది. హీరో విజయ్, అజిత్ అభిమానుల మధ్య తమిళనాట ఫ్యాన్‌వార్ అందరికీ తెలిసిందే. కెరీర్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న రోజుల్లోనే అజిత్ 2011లో తన ఫ్యాన్ క్లబ్‌లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. తన పేరును రాజకీయ అవసరాల కోసం వాడుకుంటున్నారనే ఉద్దేశ్యంతో అజిత్ ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. అభిమానులు తనకు ఇచ్చిన 'తల' (నాయకుడు) అనే బిరుదును కూడా త్యజించారాయన.

నాట్యాభినయ శోభన

80, 90 దశకంలో యువత కలల రాణిగా భాసిల్లారు కథానాయిక శోభన. ఘనమైన సంప్రదాయ నృత్య నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన ఆమె అభినయం, నృత్యం మేలికలయికగా వెండితెరపై మరపురాని పాత్రల్లో ప్రేక్షకుల్ని రంజింపజేశారు. కళ్లతోనే సమస్త హావభావాల్ని కనబరిచే నేర్పు, మనోహరమైన ముఖారవిందంతో ఆనాటి యువతలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో వివిధ భాషల్లో దాదాపు 230లకు పైగా చిత్రాల్లో నటించారు. 1980లో బాలనటిగా ఆమె సినీ రంగ ప్రవేశం చేశారు. 'మంగళ నాయగి' అనే తమిళ చిత్రంలో ఉత్తమ బాలనటిగా అవార్డును గెలుచుకున్నారు. మలయాళ చిత్రం 'ఏప్రిల్ 18' (1984) ద్వారా కథానాయికగా అరంగేట్రం చేశారు. ఇక అక్కడి నుంచి దాదాపు నాలుగు దశాబ్దాల పాటు నటనతో పాటు నాట్యకారిణిగా దేశవిదేశాల్లో అద్భుత ప్రదర్శనలతో మెప్పించారు. ఆమె నటించిన తొలి తెలుగు సినిమా 'విక్రమ్'(1986). అక్కినేని నాగార్జున తొలి సినిమా కూడా ఇదే కావడం విశేషం. ఆ తర్వాత తెలుగులోని అగ్ర హీరోలందరితో జతకట్టి మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అభినందన, దళపతి, ఏప్రిల్ 1 విడుదల, ముప్పుగోపాలుడు, నారివారి నడుమ మురారి, రౌడీ అల్లుడు, అల్లుడు గారు చిత్రాలు ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. తెలుగులో శోభన నలభైకి పైగా చిత్రాల్లో నటించారు. తొంభై దశకంలో అగ్ర కథానాయికల్లో ఒకరిగా కొనసాగారు. మలయాళంలో తాను చేసిన 'మణిచిత్రతాజు' చిత్రానికి జాతీయ ఉత్తమ నటిగా పురస్కారాన్ని అందుకున్నారు ఆ తర్వాత 'మిత్ర్ మై ఫ్రెండ్' అనే ఇంగ్లీష్ చిత్రానికిగానూ ఉత్తమ నటిగా రెండోసారి జాతీయ పురస్కారం గెలుచుకున్నారు. తన జీవితాన్ని నాట్యానికే అంకితం చేశారు శోభన. ఈ కారణంగా వివాహానికి కూడా ఆమె దూరం అయ్యారు.

'అనంత'మైన ప్రతిభ

కన్నడ నటుడు అనంత్‌నాగ్ థియేటర్ ఆర్టిస్టుగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. కన్నడ, కొంకణి, మరాఠి, హిందీ భాషల్లో ఎన్నో నాటకాలను వేసిన ఆయన కన్నడ చిత్రం 'సంకల్ప' (1973) ద్వారా సినీ రంగ ప్రవేశం చేశారు. తొలి చిత్రానికే ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్నారు. అయితే శ్యామ్ బెనగల్ దర్శకత్వంలో వచ్చిన 'అంకుర్' (1974) చిత్రంతో సమాంతర సినిమాల వైపు మళ్లారు. శ్యామ్ బెనగల్ డైరెక్ట్ చేసిన 'మంథన్' ' 'కొండుర' 'కల్‌యుగ్' చిత్రాల్లో కీలక పాత్రల్ని పోషించారు. కన్నడంతో పాటు హిందీ, మరాఠి, మలయాళ, ఇంగ్లీష్ భాషల్లో 300లకు పైగా చిత్రాల్లో నటించారు. 'కేజీఎఫ్-1' చిత్రంలో రచయిత పాత్ర ద్వారా నేటి తరం ప్రేక్షకుల్లో గుర్తింపును పొందారు. తెలుగులో 'శాంతి క్రాంతి' 'శంఖారావం' 'భీష్మ' చిత్రాల్లో ముఖ్య పాత్రల్ని పోషించారు. 'గోదిబన్న సాధారణ మైకట్టు' 'గాలిపట' వంటి కన్నడ చిత్రాల్లో ఆయన పాత్రలు ప్రేక్షకులకు బాగా గుర్తుండిపోయాయి.

శేఖర్‌కపూర్- ప్రయోగాలతో ప్రయాణం

నటుడిగా, దర్శకుడిగా భారతీయ సినీరంగంపై తనదైన ముద్రను వేశారు శేఖర్ కపూర్. దూరదర్శన్‌లో ప్రసారమైన 'ఖాన్‌దాన్' సీరియల్ ద్వారా నటుడిగా వెలుగులోకి వచ్చారు. క్లాసిక్ చిత్రం 'మాసూమ్'తో (1983) దర్శకుడిగా పరిచయమయ్యారు. నసీరుద్దిన్‌షా, షబానా ఆజ్మీ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం దర్శకుడిగా శేఖర్‌కపూర్‌కు మంచి గుర్తింపును తెచ్చి పెట్టింది. ఆ తర్వాత సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'మిస్టర్ ఇండియా' చిత్రంతో అన్ని వర్గాలకు చేరువయ్యారు. అయితే బందిపోటు పూలన్ దేవి జీవిత చరిత్ర ఆధారంగా తీసిన 'బాండిట్ క్వీన్' (1994) శేఖర్ కపూర్‌కు అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చిపెట్టింది. కేన్స్, ఎడిన్‌బర్గ్ వంటి అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో విమర్శకుల ప్రశంసలందుకొంది. ఆ తర్వాత ఆయన దర్శకత్వం వహించిన పీరియాడిక్ డ్రామా 'ఎలిజబెత్' ఏడు విభాగాల్లో ఆస్కార్ నామినేషన్ సాధించింది.

చిత్రం

జననాయకుడిగా దళపతి

తమిళ అగ్ర హీరో దళపతి విజయ్ నటిస్తున్న చివరి చిత్రం మీద అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. దళపతి 69 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి 'జన నాయగన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. హెచ్.వినోద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కే నారాయణ నిర్మిస్తున్నారు. ఆదివారం రిపబ్లిక్ డే సందర్భంగా టైటిల్ ప్రకటనతో పాటు ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఇందులో విజయ్ అభిమాన సమూహంతో సెల్ఫీ తీసుకుంటూ చిరునవ్వుతో కనిపిస్తున్నారు. రాజకీయ రంగప్రవేశం నేపథ్యంలో కెరీర్‌లో తనకు ఇదే చివరి చిత్రమని విజయ్ గతంలోనే ప్రకటించారు. దళపతి విజయ్ రాజకీయ సిద్ధాంతాలు, కార్యచరణను ఆవిష్కరించే కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారని సమాచారం. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నారు.

మనదే ఇదంతా..



రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న 75వ చిత్రం 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' ఉపశీర్షిక. భాను భోగవరపు దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. ఆదివారం హీరో రవితేజ పుట్టిన రోజు సందర్భంగా గ్లింప్స్‌ను విడుదల చేశారు. యాక్షన్ ఘట్టాలతో గ్లింప్స్ ఆద్యంతం ఆకట్టుకుంది. 'మనదే ఇదంతా..' అంటూ రవితేజ చెప్పిన డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. భీమ్స్ సిసిరోలియో నేపథ్య సంగీతం, రవితేజ ఎనర్జిటిక్ పర్‌ఫార్మెన్స్‌తో గ్లింప్స్ సినిమాపై అంచనాలు పెంచేలా ఉంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో విడుదల చేయబోతున్నారు. శ్రీలీల కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విధు అయ్యన్న, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాణ సంస్థలు: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, దర్శకత్వం: భాను భోగవరపు.

బ్రిటిష్ కాలంనాటి కథ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. 'వీడీ 14' వర్కింగ్ టైటిల్‌తో రూపొందిస్తున్న ఈ సినిమా తాలూకు సెట్‌వర్క్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ సోషల్‌మీడియా ద్వారా స్పందిస్తూ 'పీరియాడిక్ యాక్షన్ డ్రామా ఇది. బ్రిటిష్ పాలన కాలం నేపథ్యంలో వచ్చిన చిత్రాల్లో ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని కథాంశం. విజయ్ పాత్ర నవ్యరీతిలో సాగుతుంది. యథార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కించబోతున్నాం' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచన-దర్శకత్వం: రాహుల్ సంకృత్యాన్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.